క్లుప్తంగా

సీఎం రంగసామికి సత్కారం

యానాం: పుదుచ్చేరి సీఎం రంగసామిని శుక్రవారం యానాం అగ్రి హార్టీకల్చర్ సొసైటీ ప్రతినిధులు (వైఏహెచ్ఎస్) ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలసి ఆయనను ఘనంగా సత్కరించారు. సొసైటీ అధ్యక్షుడు, వ్యవసాయశాఖ రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ కామిశెట్టి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో రంగసామిని కలసి మొక్కలు బహూకరించి ఘనంగా సత్కరించారు. అనంతరం యానాం నియోజకవర్గ పరిధిలో పర్యావరణ పరిరక్షణకు చేపట్టిన పనులను వివరించారు. వ్యవసాయ శాఖ మంత్రి టి.జయకుమార్‌ను కలినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగా వెంకటేశ్వర్లు, ఎలెంథేరియన్, వెంకటాచలం, రాగిణి, ఎలుమలై, కన్నావీరన్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

అల్లవరం: బోడసకుర్రు సచివాలయం వద్ద సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన అడిషనల్ డీఎంహెచ్ఓ భరతలక్ష్మి ఆధ్వర్యంలో క్షయ వ్యాధిపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో క్షయ వ్యాధికి పరీక్షలు నిర్వహించారు. అనంతరం టీబీ నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని భరతలక్ష్మి పిలుపునిచ్చారు. అనంతరం గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటేష్, ఎంఎల్‌పీహెచ్ రాపాక సౌమ్య, నల్లి విజయకుమారి, ఎస్ఎస్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసులు నమోదు

ముమ్మిడివరం: పాత కక్షల నేపథ్యంలో ఒక వ్యక్తిపై కొందరు వ్యక్తులు దాడి చేసిన కేసులో నిందితులపై కేసు నమోదు చేసినట్లు ముమ్మిడివరం ఇన్‌చార్జ్ ఎస్సై ఎంవీవీ రవీంద్రబాబు తెలిపారు. సోమిదేవరపాలెంకు చెందిన గుర్రాల సత్యనారాయణ ఫిర్యాదు మేరకు దారి కాచి దాడి చేసిన అదే గ్రామానికి చెందిన పువ్వల శ్రీనివాసరావు, ఉందుర్తి ఏడుకొండలు, చుట్టుగుళ్ల విజయ్, మట్టా సతీష్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. అదే ఘటనకు సంబంధించి పువ్వల శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుర్రాల సత్యనారాయణ, అతని కుమారుడు లోవరాజుపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

టెండర్లు పిలవకుండానే సీసీ రహదారుల నిర్మాణం

తాళ్లరేవు: మండల పరిధిలోని పి.మల్లవరం పంచాయతీ శివారు పత్తిగొంది గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు పిలవకుండానే రహదారులు నిర్మించి కొందరు అవినీతికి పాల్పడ్డారని పంచాయతీ 11వ వార్డు సభ్యురాలు దున్నా నాగరత్నం ఆరోపించారు. ఈ మేరకు ఆమె భర్త దున్నా రవిశంకర్‌తో కలసి స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 10న సీసీ రహదారులకు సంబంధించి తమకు నోటీసు ఇచ్చారని, దానిలో టెండర్ తేదీ 16గా చూపించారన్నారు. అప్పటికే సుమారు లక్షలాది రూపాయల వ్యయంతో నాన్ లే అవుట్ స్థలంలో సీసీ రహదారులను అధికారుల పర్యవేక్షణ లేకుండా వేసారని ఆరోపించారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేసారు.

భూముల విభజనకు ఫీజు మినహాయింపు

అమలాపురం రూరల్: సర్వే పూర్తి చేసిన గ్రామాల్లో వెబ్‌ల్యాండ్ 2.0లో జాయింట్ పట్టాదారులుగా నమోదైన భూయజమానులు, వారి భూములను విభజన చేసేందుకు ప్రభుత్వం నిర్దేశించిన రూ.500 రుసుం పూర్తిగా మినహాయించి ఉచితంగా ఈ సేవను పొందేందుకు అవకాశం కల్పించారని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి చెప్పారు. దీనికి కేవలం నామ మాత్రపు దరఖాస్తు రుసుం రూ.50 గ్రామ సచివాలయంలో చెల్లించి జూన్ 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని జేసీ సూచించారు. ఈ సదావకాశాన్ని జాయింట్ పట్టాదారులు అందరూ ఉపయోగించుకుని జాయింట్ పట్టాలను విడివిడిగా విభజన చేయించుకోవాలని కోరారు. జాయింట్ పట్టాదారులుగా నమోదైన భూయజమానులు జాయింట్ పట్టా విభజన కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జేసీ తెలియజేసారు.

ఎంపీకి కోనసీమ జేఏసీ సత్కారం



ఎంపీ హరీష్ మాధూర్‌ను సత్కరిస్తున్న కోనసీమ జేఏసీ బృందం ప్రతినిధులు

అమలాపురం టౌన్: పాకిస్తాన్ ఉగ్రవాద చర్యలను ఖండిస్తూ పలు దేశాల్లో పర్యటించి దేశానికి మద్దతు కూడగట్టిన ఎంపీల బృందంలో సభ్యుడిగా అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధూర్ చేసిన కృషి అభినందనీయమని కోనసీమ జేఏసీ కన్వీనర్ బండారు రామమోహనరావు అన్నారు. విదేశాల పర్యటన అనంతరం అమలాపురం వచ్చిన ఎంపీ హరీష్ మాధూర్‌ను స్థానిక క్యాంపు కార్యాలయంలో కోనసీమ జేఏసీ బృందం శుక్రవారం ఘనంగా సత్కరించి అభినందించింది. జేఏసీ ప్రతినిధులు డాక్టర్ మధుర నరసింహమూర్తి, డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి, కరాటం ప్రవీణ్, మాడా రాము, నంద్యాల నాయుడు, ముమ్మిడి ప్రతాప్‌కుమార్, బాదం సుధాకరరెడ్డి తదితరులు పాల్గొని ఎంపీని సత్కరించారు.

జన ఔషధికి ఆదరణ

- గ్రామాల్లోనూ పెరుగుతున్న మందుల వినియోగం
- బ్రాండెడ్ మందులపై ధరాభారం
- జనం చూపు జనరిక్ మందుల వైపు
- 10 నుంచి 80 శాతం మందుల ధరలు తగ్గుదల



అమలాపురం ఏరియా ఆసుపత్రి వద్ద జనరిక్ మందుల షాపు

అమలాపురం రూరల్: మనిషి జీవితంలో ఆరోగ్యం ఎంతో ముఖ్యం. సాధారణ వ్యాధులతోపాటు దీర్ఘకాలిక వ్యాధుల బారిన వారు వైద్యుడిని సంప్రదించిన అనంతరం ఆయన రాసిన మందుల చీటీతో నేరుగా షాపు వద్దకు వెళ్లి మందులను తెచ్చుకుంటుంటారు. దుకాణాల్లో బ్రాండెడ్ మందులు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా జనరిక్ మందులు (జన ఔషధి) సైతం మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. సీజనల్ వ్యాధుల ప్రభావం అధికమైన నేపథ్యంలో పట్టణాలతోపాటు గ్రామాల్లో మందుల వినియోగం పెరగనుంది. ఇలాంటి పరిస్థితుల్లో జనరిక్ మందులపై ప్రజలకు అవగాహన అవసరం. జనరిక్ మందుల వినియోగాన్ని పెంచాలన్న లక్ష్యంతో 2023లో నేషనల్ మెడికల్ కమిషన్ రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ (ఎన్ఎంసీఆర్ఎంపీ) ఎన్ఆర్‌సీఆర్ఎంపీ నియమావళి-2023ను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది.

జనరిక్ మందులతో భారం తగ్గేదిలా..

ప్రైవేటు షాపుల్లో మందులను ఎమ్మార్పీకే విక్రయిస్తున్నప్పటికీ ఆ రేటు నిర్ధారణలోనే కంపెనీలు లాభార్జనకు అధిక ప్రాధాన్యమిస్తున్నాయని ప్రజా సంఘాల నాయకులు చెబుతున్నారు. తయారీదారులు, డిస్ట్రిబ్యూటర్లు, రిటైల్‌దారులు ఇలా పలు చేతులు మారాల్సి ఉండటంతో ధర అధికంగా ఉండటానికి ఓ కారణమంటున్నారు. ప్రైవేట్ షాపుల విక్రయాలతో పోలిస్తే జనరిక్ దుకాణాల్లోని మందుల ధరలు 10 నుంచి 80 శాతం పైగా తక్కువ ఉంటుంది. పారాసిట్మాల్ 10 మాత్రలు ధర జనరిక్ షాపులో రూ.12, ప్రైవేట్ షాపులో రూ.20 నుంచి రూ.30 వరకూ ఉంటుంది. బీపీ 10 మాత్రల ధర జనరిక్‌లో రూ.12, బ్రాండెడ్‌లో రూ.80, సుగరు నివారణకు 10 మాత్రలు జనరిక్‌లో రూ.15, బ్రాండెడ్‌లో రూ.50, జింక్ మల్టీ విటమిన్ రూ.15 మాత్రలు జనరిక్‌లో రూ.20, బ్రాండెడ్‌లో రూ.105, గ్యాస్ట్రిక్ సమస్యకు 15 మాత్రలు జనరిక్‌లో రూ.15, బ్రాండెడ్‌లో రూ.135, సి విటమిన్ పది మాత్రలు ధర జనరిక్‌లో రూ.40, ప్రైవేట్ షాపులో రూ.70, డి.విటమిన్ నాలుగు కాప్యూల్స్ ధర జనరిక్‌లో రూ.40, ప్రైవేట్‌లో రూ.90 ఇలా అనేక మందుల ధరల్లో వ్యత్యాసాలున్నాయి.

ఎన్ఎంసీఆర్ఎంపీ నిబంధనలిలా ..

జనరిక్ మందులు రాయాలంటూ 2002లోనే భారత వైద్య మండలి (ఐఎంసీ) నింబధనలను రూపొందించినప్పటికీ రాయకపోతే తీసుకోవాల్సిన చర్యలను ప్రస్తావించలేదు. 2023లో నేషనల్ మెడికల్ కమిషన్ రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ (ఎన్ఎంసీఆర్ఎంపీ) ఎన్ఆర్‌సీఆర్ఎంపీ నియమావళి-2023 తీసుకురాగా అది అమల్లోకి తెచ్చినట్టు జాతీయ వైద్య కమిషన్ వెల్లడించింది. దాని ప్రకారం తమవద్దకు వచ్చే రోగులకు చౌకగా లభించే జనరిక్ మందులను రాయాలని, రాయని వైద్యులపై లైసెన్స్ రద్దు చేయడం లాంటి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేసింది.

జనరిక్ మందులు కొనుగోలు చేస్తా



వైద్యులు జనరిక్ మందులు వాడవచ్చని చెప్పారు. అపోహలు వీడి బ్రాండెడ్ వాటి కంటే తక్కువ ధరకు, నాణ్యమైన మందులు జనరిక్‌లో లభ్యమవుతున్నాయి. నా కుటుంబ సభ్యుల కోసం నేను జనరిక్ షాపులోనే మందులు కొంటున్నాను. ప్రభుత్వం వీటి సంఖ్యను పెంచాలి.

– ఉబ్బన శ్రీనివాసరావు, అమలాపురం

ఆసుపత్రులు, మందుషాపుల వివరాలు

సామాన్యులకు తక్కువ ధరకే ఔషధాలను అందించాలన్న ప్రధాన లక్ష్యంతో 2015లో జనరిక్ మందుల (జన ఔషధి) దుకాలను ఏర్పాటు చేసినప్పటికీ వీటి సంఖ్యను విస్తృతం చేయలేదు. నియోజకవర్గంలో అమలాపురంలో ఒక ఏరియా ఆసుపత్రి, అల్లవరం, అమలాపురం రూరల్, ఉప్పలగుప్తం మండలాల్లో 8 పీహెచ్‌సీలు, రెండు సీహెచ్‌సీల ద్వారా ప్రజలు వైద్య సేవలు అందుతున్నాయి. ఒక ప్రైవేట్ మెడికల్ కళాశాల, సుమారు 25 ప్రైవేట్ అసుపత్రుల ద్వారా రోగులకు వైద్యసేవలు అందుతున్నాయి. అమలాపురంలో 170 వరకు ఇంగ్లిష్ మందుల షాపులు ఉండగా కేవలం జనరిక్ మందుల షాపులు అమలాపురం పట్టణంలో 5, అల్లవరం మండలం కొమ్మరగిరిపట్నం ఒక షాపు ఉన్నాయి. జనరిక్ షాపులను పెంచి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి చేయండి

కాట్రేనికోన: అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ముమ్మిడివరం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ముదునూరి నిహారిక అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ తులసి అధ్యక్షతన అంగన్‌వాడీ చిన్నారులకు అక్షరాభ్యాసం, గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో రెండేళ్ల పాటు చదువుకుని ప్రైమరీ పాఠశాలకు వెళుతున్న 28 మంది విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్స్‌ను అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరిన 31 మంది విద్యార్థులకు ఎంపీడీఓ వెంకటాచలంతో కలసి సీడీపీఓ అక్షరాభ్యాసం చేయించారు. జెడ్పీటీసీ నేల కిషోర్‌కుమార్, ఎంపీపీ కోలాటి సత్యవతి, నాయకులు కోలాటి సత్యం, సూపర్‌వైజర్లు తులసి, ఎల్‌వీ రమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు రుణాల అందజేత

యానాం: నియోజకవర్గ పరిధిలో చేపలు విక్రయించుకుంటూ జీవనోపాధి సాగించే మత్స్యకారులకు పుదువై భారతీయర్ గ్రామీణ బ్యాంకు, యానాం, కనకాలపేట శాఖలు మంజూరు చేసిన రుణాలను శుక్రవారం ఆర్ఏఓ మునిస్వామి లబ్ధిదారులకు అందజేశారు. స్థానిక మత్స్యశాఖ కార్యాలయంలో ఆయన కిసాన్ క్రెడిట్ కార్డులు, ఎస్‌హెచ్‌జీ, జేఎల్‌జీ, ఎస్ఎమ్ఈ రుణాలుగా రూ.60 లక్షలు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పుదువై భారతీయర్ గ్రామీణబ్యాంకు చైర్మన్ డి రత్నవేలు, డీడీఎం ఆర్‌వీ సిద్ధార్థ పాల్గొన్నారు.

అమలాపురం డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాసరావు



డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావును అభినందిస్తున్న డ్రగ్ ట్రేడ్ యూనియన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా బి.శ్రీనివాసరావు స్థానిక పోస్టల్ కాలనీలోని డ్రగ్ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీనివాసరావు కాకినాడ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకూ అమలాపురం డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన భూపేష్ విజయవాడకు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావును జిల్లా డ్రగ్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు శ్రీఘాకోళపు శ్రీనివాసరావు, అమలాపురం యూనియన్ అధ్యక్షుడు కొమ్మూరి వెంకటచల ప్రసాద్, జిల్లా కార్యదర్శి వర్రే బాబి, యూనియన్ ప్రతినిధులు మోకా వెంకటసుబ్బారావు, గునిశెట్టి వలీబాబా తదితరులు కలసి అభినందించారు. ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్ ఆధ్వర్యంలో పలు వ్యాపార సంఘాల ప్రతినిధులు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావును అభినందించారు.

అసిస్టెంట్ రాత పరీక్ష ఇన్విజిలేటర్లకు శిక్షణ



ఇన్విజిలేటర్లకు శిక్షణనిస్తున్న అధికారులు

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా సుమారు 256 అసిస్టెంట్ పోస్టుల భర్తీ కోసం రెండు ఫేజ్‌లుగా నిర్వహిస్తున్న రాత పరీక్షల్లో భాగంగా రెండవ ఫేజ్ అసిస్టెంట్ (టైర్-2) రాత పరీక్ష ఈనెల 22 ఆదివారం నిర్వహించనున్న నేపథ్యంలో ఇన్విజిలేటర్లకు సిబ్బందికి తదితరులకు స్థానిక ఆర్ఏఓ ఆఫీసు కాన్ఫరెన్స్‌హాలులో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 70 మంది సిబ్బందికి పరీక్షా కేంద్రంలో పాటించాల్సిన నిబంధనలు, ఓఎమ్మార్ షీట్, ప్రశ్నాపత్రం జారీలో పాటించాల్సిన విధి విధానాలను వివరించారు. యానాంలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని అందులో రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లిషు మీడియం హైస్కూల్, మహాత్మాగాంధీ ప్రభుత్వ బాలుర హైస్కూల్ ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే అభ్యర్థుల అడ్మిట్‌కార్డులను విడుదల చేశారు.

తహసీల్దార్లకు ఉత్తమ సేవా పురస్కారం



కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ నిషాంతి చేతుల మీదుగా ఉత్తమసేవా పురస్కారం అందుకుంటున్న ఎంవీ సుబ్బలక్ష్మి, తహసీల్దార్ దివాకర్

ముమ్మిడివరం: రెవెన్యూ డే సందర్భంగా ముమ్మిడివరం తహసీల్దార్ ఎంవీ సుబ్బలక్ష్మికి ఉత్తమ సేవా పురస్కారం లభించింది. కోనసీమ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ ఉద్యోగుల సదస్సులో కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్ చేతుల మీదుగా రెవెన్యూ శాఖలో ఉత్తమ సేవలందించినందుకు సుబ్బలక్ష్మి ఈ పురస్కారం అందుకున్నారు. ముమ్మిడివరం తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు తహసీల్దార్ ఎంవీ సుబ్బలక్ష్మిని అభినందించారు.

తహసీల్దార్‌కు పురస్కారం

ఉప్పలగుప్తం: రెవెన్యూ దినోత్సవం సందర్భంగా స్థానిక తహసీల్దార్ వీఎస్ దివాకర్‌కు పురస్కారం లభించింది. ఈ పురస్కారాన్ని కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జేసీ నిషాంతి దివాకర్‌కు శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనను అభినందించారు.

మేజర్ డ్రెయిన్ల పరిశీలన



అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలో మేజర్ డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

అమలాపురం టౌన్: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని మేజర్ డ్రెయిన్లను మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ శుక్రవారం ఉదయం పరిశీలించారు. ఇటీవల కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన నిర్మల్‌కుమార్ పట్టణంలో పారిశుధ్య పరిస్థితులను సమీక్షించేందుకు క్షేత్ర పర్యటన చేశారు. మున్సిపల్ పారిశుధ్య సిబ్బందితో పాటు పట్టణ ప్రజలు కూడా అంతే బాధ్యతతో డ్రెయిన్ల నిర్వహణపై ఉండాలని సూచించారు. డ్రెయిన్లలో వాడి పాడేసిన ప్లాస్టిక్ వస్తువులు వేయకూడదని ఆయన హితవు పలికారు. డ్రెయిన్లు సజావుగా ప్రవహించేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు పాటు పడుతూ డ్రెయిన్లు చెత్తా చెదారంతో ముఖ్యంగా ప్లాస్టిక్ వస్తువులతో నిండకుండా ఎవరికి వారు వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ నిర్మల్‌కుమార్ సూచించారు. హౌసింగ్ బోర్డు కాలనీ తదితర ప్రాంతాల్లోని మేజర్ డ్రెయిన్లను కమిషనర్ పరిశీలించారు. మున్సిపల్ ఏఈ కృష్ణ, మున్సిపల్ కౌన్సిలర్ బొర్రా వెంకటేశ్వరరావు కమిషనర్ వెంట ఉన్నారు.

వృద్ధులను గౌరవించాలి

యానాం: వృద్ధులు నిర్లక్ష్యానికి, నిరాదరణకు గురవుతున్నారని సమకాలీన సామాజిక, ఆర్థిక పరిస్థితులు వృద్ధులకు శాపంగా మారాయని సీనియర్ సిటిజన్ల హక్కులను, కుటుంబ సభ్యులతో పాటు సమాజం కూడా గుర్తించాలని పలువురు పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ అవగాహన రోజును పురస్కరించుకుని స్థానిక సబ్‌కోర్టులో యానాం న్యాయసేవా సమితి (యానాం లీగల్ ఎయిడ్ కౌన్సిల్) ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్లనుద్దేశించిన చట్టాలు, హక్కులను వివరించారు. వృద్ధుల సంక్షేమం, తల్లిదండ్రుల పోషణ చట్టం-2007 తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సబ్‌జడ్జి ఆర్ సుబ్రహ్మణ్యం, న్యాయసేవా సమితి న్యాయవాది పి.ఆదినారాయణ మూర్తి, న్యాయవాదులు నటరాజన్, కె విజయకుమార్, ఏపీపీ ఎస్‌డీఎస్ శ్రీనివాస్, పడాల సుబ్బారావు, గెద్దం భ్రమరాంబిక, స్వరాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

యోగాంధ్ర పేరుతో ప్రజాధనం దుర్వినియోగం



కుంచే రమణారావు

ఉప్పలగుప్తం: కూటమి ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర దినోత్సవం పేరుతో రాష్ట్రంలో ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని వైఎస్సార్ సీపీ అమలాపురం నియోజకవర్గ సీనియర్ నాయకుడు కుంచే రమణారావు ఆరోపించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన ఓ ప్రకటనను విడుదల చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అండగా సంక్షేమాలను అందిస్తే, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంక్షేమ కార్యక్రమాలను పక్కకు నెట్టి రూ.300 కోట్ల ప్రజాధనాన్ని కేవలం ప్రచార ఆర్భాటాలకు ఖర్చు చేస్తున్నారన్నారు. ఒక పక్క ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెడుతూ మరొక పక్క వందల కోట్ల రూపాయలు ఖర్చు చేయడం సబబు కాదన్నారు. గత ప్రభుత్వం హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని తీసుకుని వచ్చి ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందేలా కృషి చేశారన్నారు. ప్రచార ఆర్భాటాన్ని ప్రభుత్వం తగ్గించుకుని రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించాలని కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

యానాం: సైబర్ నేరాలపై అందరూ అప్రమత్తతో వ్యవహరించాలని ఆధునిక సాంకేతికాభివృద్ధి నేపథ్యంలో పెరుగుతున్న మోసాలపై జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాఫిక్ ఎస్సై శేరు నూకరాజు పేర్కొన్నారు. శుక్రవారం కనకాలపేట ప్రభుత్వ హైస్కూల్లో సైబర్ నేరాలు, పిల్లలపై వేధింపులు, డ్రగ్స్ నివారణ, ట్రాఫిక్ నిబంధనలు తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్‌లో ఆన్‌లైన్ లింకులు, రుణ యాప్‌లు, ఓటీపీ, బ్యాంక్ అకౌంట్ నంబర్లు, ఆధార్ నంబర్ చెప్పాలని వచ్చే ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దని సూచించారు. మొబైల్ ఫోన్ వాడకం వల్ల తీవ్ర దుష్ప్రభావాలు పడుతున్నాయని, విద్యార్థులు మొబైల్ వినియోగాన్ని తగ్గించాలన్నారు. డ్రగ్స్, మత్తు పదార్థాల జోలికి వెళ్లరాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు భద్రతకు ప్రత్యేక చట్టాలు

అమలాపురం రూరల్: మహిళా సంరక్షణ కార్యదర్శులు మహిళలకు భద్రత కోసం రూపొందించిన శక్తి యాప్, ఉమెన్ సేఫ్టీ ఇన్ సైబర్ క్రైమ్‌పై అవగాన పెంచుకోవాలని డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ అన్నారు. అమలాపురం సబ్ డివిజన్‌లో పరిధిలో మహిళా సంరక్షణ కార్యదర్శులకు అమలాపురం మండల మహిళ సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రసాద్ మాట్లాడుతూ మహిళా సంరక్షణ కార్యదర్శులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అమలాపురం రూరల్ సీఐ ప్రశాంతకుమార్, అమలాపురం టౌన్ సీఐ వీరబాబు పలు సూచనలు చేశారు. అల్లవరం ఎస్సై తిరుమలరావు, ఎస్సై శేఖర్‌బాబు పాల్గొన్నారు.

భారతీయ వారసత్వ సంపద యోగా



అమలాపురం గడియారం స్తంభం సెంటరులో యోగాసనాలు వేస్తున్న వైద్య విద్యార్థులు, ప్రజలు

అమలాపురం రూరల్: భారతీయ వారసత్వ సంపద అయిన యోగాసనాల సాధనను నేడు ప్రపంచమంతా అనుసరించడం మన దేశానికి ఎంతో గర్వకారణమని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అన్నారు. శుక్రవారం ఆమె కలెక్టరేట్‌లో పాత్రికేయుల సమావేశం నిర్వహించి యోగా దినోత్సవ వేడుకల నిర్వహణ తీరును వివరించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఐక్యరాజ్యసమితిని ఒప్పించి అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రకటించి పదేళ్లు పూర్తయిందని తెలిపారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లపై జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న కార్యక్రమాలను తెలియజేశారు. యోగాంధ్ర మాసోత్సవంలో భాగంగా వివిధ వర్గాల వారిని భాగస్వాములను చేసి వారి ద్వారా ప్రజలను చైతన్యవంతులు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ మండలాలు పట్టణాలలో శిక్షకులతో యోగాసనాలను సాధన చేయించామన్నారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ప్రతి గ్రామం, మండలం, పట్టణం, ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఇప్పటికే 4,650 వేదికల్లో సుమారు 8 లక్షల మంది పాల్గొని శిక్షకుల ద్వారా యోగాసనాలు వేసేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో స్థానిక కిమ్స్ వైద్యశాలలో సుమారు 5 వేల మందితో ఉదయం 7 నుంచి 8 గంటల మధ్య యోగా సాధన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

యోగాసనాలపై శిక్షణ

అమలాపురం టౌన్: అమలాపురం కిమ్స్ వైద్య విద్యా సంస్థ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు ప్రోత్సాహంతో యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక గడియార స్తంభం సెంటరులో శుక్రవారం ఉదయం యోగా గురువులు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో దాదాపు 500 మంది యోగాసనాలు వేశారు. యోగా గురువు డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు యోగాసనాలపై అవగాహన కల్పించారు. కిమ్స్ వైద్య కళాశాల విద్యార్థులు, ప్రొఫెసర్లు, డాక్టర్లు, ప్రజలు గడియారం స్తంభం రోడ్డుపై యోగాసనాలు వేశారు. కిమ్స్ ఫిజియోథెరపీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్ చక్రవర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న వారిని కిమ్స్ మేనేజింగ్ డైరెక్టర్ రవికిరణ్ వర్మ, వైద్య కళాశాల డీన్ డాక్టర్ ఆనంద్ ఆచార్య, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.సుబ్బారావు అభినందించారు.

యోగా నిపుణురాలు సుబ్బలక్ష్మికి సత్కారం

యోగా దినోత్సవం సందర్భంగా కొన్ని దశాబ్దాలుగా ఎందరికో యోగాసనాలపై శిక్షణ ఇస్తున్న యోగా నిపుణురాలు దువ్వూరి సుబ్బలక్ష్మిని వాకర్స్ సత్కరించారు. స్థానిక వడ్డిగూడెంలోని శ్రేయ మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సత్కార కార్యక్రమానికి వైద్య దంపతులు డాక్టర్ కె.శ్రీమన్నారాయణ, డాక్టర్ అనంతలక్ష్మి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. యోగా సాధనతో అమలాపురంలో పాటు కోనసీమలో ఎంతో మందికి యోగాసనాలపై శిక్షణ ఇస్తున్న సుబ్బలక్ష్మి సేవలు అభినందనీయమని డాక్టర్ దంపతులు పేర్కొన్నారు. వాకర్స్ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, అంతర్జాతీయ వాకర్స్ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, వాకర్స్ ఏరియా కో ఆర్డినేటర్ తేతల సత్యనారాయణరెడ్డి, కోనసీమ మహిళా మండలి ప్రతినిధులు పోలిశెట్టి అనంతలక్ష్మి, పుత్సా రాజేశ్వరి తదితరలు యోగా నిపుణురాలు సుబ్బలక్ష్మిని సత్కరించారు.

'యోగా ఒక జీవన శైలి' పుస్తకావిష్కరణ

అమలాపురం టౌన్: పట్టణానికి చెందిన శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు, కవి నల్లా నరసింహమూర్తి రచించిన 'యోగా ఒక జీవన శైలి' పుస్తకాన్ని స్థానిక కలెక్టరేట్ ఏవో కె.కాశీవిశ్వేశ్వరరావు శుక్రవారం ఆవిష్కరించారు. స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆవిష్కర్త ఏవో విశ్వేశ్వరరావు మాట్లాడుతూ యోగా దినోత్సవం సందర్భంగా కవి నరసింహమూర్తి యోగాను ఓ జీవన శైలితో పోల్చి రాసిన పుస్తకం ఆరోగ్యదాయకంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొని రచయిత నరసింహమూర్తిని అభినందించారు.